


సమగ్రశిక్షలో నోటిఫికేషన్ అవాస్తవం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా సమగ్రశిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని జిల్లా సమగ్రశిక్షా అదనపు పథక సమన్వయకర్త వేమలి స్వామి నాయుడు తెలిపారు. జిల్లా సమగ్రశిక్షా కార్యాలయంలో ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ సబ్ ఆర్డినేటర్స్ మొదలగు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల అయినట్లు జిల్లాలో ఒక అబద్ధపు ప్రచారం జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. జిల్లా కార్యాలయంలో పోస్టులు భర్తీ చేయాలని తమకు స్టేట్ అధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని ఏపిసి చెప్పారు. కానీ ఒక 'ఫేక్ వెబ్ సైట్' ద్వారా ఈ విషయం తన నోటీసుకు వచ్చిందని తెలిపారు. ఈ వెబ్ సైట్ కు గాని, upi app రన్ చేస్తున్న వ్యక్తి గాని జిల్లా సమగ్రశిక్షకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. నిరుద్యోగులంతా ఈ విషయాన్ని గమనించి మోసపోవద్దని సూచించారు.

ధాన్యం డబ్బులు మహాప్రభో..!



అందరికీ అన్నం పెట్టే రైతన్న సంక్రాంతి వేళ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. పిండి వంటలకు అవసరమయ్యే పప్పుబెల్లాలకు, కొత్త బట్టలకు డబ్బులు లేక ధాన్యం పండించే రైతులు ఇంటిల్లపాదితో కలివిడిగా ఉండలేని పరిస్థితి నెలకుంది. రైతులకు ఎలాగూ గిట్టుబాటు ధర కల్పించలేదు. కనీసం కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. పండగంటిపూట ఆడపిల్లలు, అల్లుళ్లను ఆప్యాయతగా చూసుకోలేని పరిస్థితి నెలకొంది. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాంలో సొమ్ము కూడా చెల్లించకపోవడమే ఇందుకు కారణం.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో రూ.350 కోట్ల బకాయి

పండగ సమీపించినా నేటికీ జమకాని వైనం

కొనుగోలుకు నోచుకోని 2.48 మెట్రిక్ టన్నులు

సంక్రాంతి వేళ రైతన్న కలవరం

జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 2లక్షల 27వేల ఎకరాలు కాగా, ఈఏడాది 2,32,360 ఎకరాల్లో సాగయ్యింది. దీనికి వాతావరణం కూడా అనుకూలించింది. సెప్టెంబర్లో కురిసిన వర్షాల వల్ల కాస్త పంటలు దెబ్బతిన్నప్పటికీ మెజార్టీ విస్తీర్ణంలో ఆశాజనకంగానే కనిపించింది. గత ఏడేళ్లతో పోలిస్తే, ఈ ఏడాది సకాలంలో సాగైంది. సాగు విస్తీర్ణంతోపాటు సగటు దిగుబడి కూడా ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. సగటున ఎకరాకు 2,110 కిలోలు (26 బస్తాలు) ఉత్పత్తి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. కానీ, అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి అన్నట్లుగా పెట్టుబడులు పెరిగినప్పటికీ ఆ స్థాయిలో ధాన్యం ధర పెరగలేదు. రైతులకు మద్దతు పేరుతో రూ.2,040, ఎ-గ్రేడ్కు రూ.2,060గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత ఏడాదితో పోలిస్తే పెరిగినప్పటికీ పెంచింది కేవలం రూ.100 మాత్రమే. ఇది ఎటూ సరిపోక రైతులు మళ్లీ అప్పుల ఊబిలో కొట్టుమిట్టాడక తప్పని పరిస్థితి. ఇటువంటి పరిస్థితుల్లో కనీసం బిల్లులైనా సకాలంలో చెల్లించాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ ఏడాది 4.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు కేవలం 2లక్షల 48వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. గోనె సంచులు లేక పోవడం, మిల్లుల మాయాజాలాలు సకాలంలో బ్యాంకు గ్యారంటీలు ఇవ్వకపోవడం వల్ల నత్తనడకన సాగుతోంది. బకాయిలు ఎక్కువగా ఉండడంతో, చెల్లింపు ఒత్తిడి లేకుండా ప్రభుత్వమే సాంకేతిక సమస్యలను సాకులుగా చూపుతోందని కూడా రైతులు, రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి. కారణం ఏదైనా 1.92మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా కొనుగోలు చేయాల్సివుంది. బిల్లుల విషయానికి వస్తే ధాన్యం సేకరించిన 21రోజుల్లో బిల్లులు చెల్లిస్తామంటూ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఆచరణలో ఇప్పటి వరకు సేకరించిన ధాన్యానికి సుమారు రూ.4.75కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సివుండగా రైతులకు అందింది రూ.125కోట్లు మాత్రమే. చెల్లించాల్సిన బకాయి రూ.350కోట్ల వరకు ఉంది. అధికారులు మాత్రం బిల్లులు సకాలంలో చెల్లింపులు జరుగుతున్నట్టు, 21రోజుల లోపు సేకరించినవి మాత్రమే పెండింగ్లో ఉన్నట్టు చెబుతున్నారు. అదే వాస్తవమనుకుంటే చెల్లించిన బిల్లులను బట్టి కేవలం 21రోజులోపే 60శాతానికి పైగా కొనుగోలు చేసినట్టుగా భావించాల్సి వుంటుందని రైతులు, రైతు సంఘాల నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవంగా నవంబర్లోనే ధాన్యం కొనుగోలు ప్రారంభమైంది. డిసెంబర్ మొదటివారం నాటికి ఊపందుకుంది. దీన్నిబట్టి ప్రభుత్వం నిర్ధేశించిన 21రోజులు దాటినా బిల్లులు చెల్లించలేదన్నది స్పష్టమౌతోంది. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే సంక్రాంతి పండగను ఒకప్పుడు రైతులు అత్యంత వైభవంగా జరుపుకునేవారు. ముఖ్యంగా ధాన్యం డబ్బులు రెండు వారాల ముందే రైతుల చేతికి అందేవి. కొత్త బట్టలు, పండివంటలకు అవసరమైయే సామగ్రి కొనుక్కునేవారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోలుగానీ, చెల్లింపులుగానీ కనీసం సగానికి సగం కూడా జరగకపోవడంతో రైతు కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల నడుమ పండగ జరుపుకోవాల్సిన పరిస్థితి దాపురించింది.

ఆదర్శం.. స్వామి వివేకానంద జీవితం

కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి -విజయనగరం కోట

స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ ఎ.సూర్య కుమారి అన్నారు. గురువారం యువజన సర్వీసుల శాఖ, సెట్విజ్ ఆధ్వర్యాన ఎంఆర్ కళాశాల మైదానంలో వివేకానందుని జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎ.సూర్య కుమారి ముందుగా వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత దేశానికి ఆదర్శమని, యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి అలవాట్లుతో జీవితములో ఉన్నత స్థాయిలో స్థిర పడాలని కోరారు. ఆపదలో ఉన్న వారికి సహాయపడాలని కోరారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ ఎన్వికె దుర్గా ప్రసాద్, నెహ్రు యువ కేంద్రం యువజనాధికారి విక్రమాదిత్య, 13(ఎ) బెటాలియన్ కల్నల్ ఎం.కె. ఆంటోని, ఎంఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, సెట్విజ్ మేనేజరు కె.వి.ఎస్.ఎన్. మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.



వివేకానంద చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

సీతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో..

స్వామి వివేకానంద జయంతిని స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ వివేకనందుడ్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, ఎన్సిసి అధికారి సత్యవేణి, మజ్జి వరలక్ష్మి, సెక్యూరిటీ ఆఫీసర్ సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టాంప్ పేపర్ విక్రయాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర వ్యాప్తంగా స్టాంప్ పేపర్ అమ్మకం దారులపై విజిలెన్స్ శాఖ జరిపిన తనిఖీలలో గురువారం నగరంలోని పలు లైసెన్స్ స్టాంప్ వెండర్లను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. తనిఖీల్లో కొందరు స్టాంప్ వెండర్లు నిర్దేశిత ముఖ విలువ కన్నా అధిక ధరలకు స్టాంప్ పేపర్లను అమ్ముతున్నట్లు విజిలెన్స్ అధికరులు గుర్తించి సంబంధిత అమ్మకాందారులపై చర్యలకు సిఫార్సు చేశారు. దాడులలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ సింహాచలం, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, పురుషోత్తం పాల్గొన్నారు.



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ అధికారులు



రద్దీగా ఉన్న ఎంజి రోడ్డు

జనసంద్రంగా నగరం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి పండగ నేపథ్యంలో నగరంలోని ఎంజి రోడ్డు, పిడబ్ల్యు మార్కెట్ వేలాది మందితో జనసంద్రంగా మారింది. ఇతర ప్రాంతాల నుంచి, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి పండగకు వచ్చి కావాల్సిన వస్త్రాలు, సామాగ్రి కొనుగోలు చేశారు. దీంతో అడుగు తీసి అడుగు వేయడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. ఒక చోటు నుంచి ఇంకో చోటుకు వెళ్లేందుకు సుమారు అరగంట సమయం పట్టింది. మార్కెట్లోకి ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది.

రోడ్డు పన్ను ఉత్తర్వులను రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన త్రైమాసిక రోడ్ టాక్స్ ఉత్తర్వులను రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రవాణా రంగంపై త్రైమాసిక రోడ్ టాక్స్ పెంచుతూ మరో భారాన్ని వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్పోర్టు ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎ. జగన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. కోవిడ్-19 అనంతర కాలంలో పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలతో తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదుకోకపోగా రహదారుల మరమ్మత్తుల పేరుతో పెట్రోల్, డీజిల్ పై లీటరుకు ఒక రూపాయి చొప్పున సెస్ విధించిందని, కానీ రాష్ట్రంలో ఎక్కడా రహదారుల మరమ్మత్తులు చేయలేదని విమర్శించారు. జాతీయ రహదారులపై టోల్ టాక్స్లు పెంచడం వలన మోయలేని భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఇచ్చిన త్రైమాసిక రోడ్ టాక్స్ 30శాతం పెంపును ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.

జిఒ 1ని రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

జిఒ 1ని రద్దు చేయాలని సిఐటియు ఆధ్వర్యాన గురువారం మండలంలోని వెంకటరమణపేట క్వారీ కార్మికులు నిరసన చేపట్టారు. జిఒ కాపీలను మంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి పోలీస్ చట్టాన్ని సుప్రీంకోర్టు నిషేధించిందని గుర్తుచేశారు. అటువంటి నిషేధిత చట్టాలను ప్రజలపై, కార్మికులపై, యువతపై, ఉద్యోగులపై జిఒ నంబర్ ఒకటి రూపంలో తీసుకొచ్చి ప్రజాస్వామ్య హక్కులకు, విలువలకు భంగం కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి చేస్తోందన్నారు. గత టిడిపి హయాంలో వైసిపి అధినేత జగన్ ప్రజా సంకల్ప యాత్రకు ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందని గగ్గోలు పెట్టారని గుర్తుచేశారు. ప్రస్తుతం వైసిపి అధికారంలోకి వచ్చేసరికి మళ్లీ అలాంటి చర్యలకే పాల్పడుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోమాట చెప్పడం సిగ్గుచేటన్నారు. 'మాట తప్పం.. మడమ తిప్పం' అంటే ఇదేనా? అని ఎద్దేవాచేశారు. జిఒ 1ని రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిహెచ్ ముత్యాలు, బంగారు బాబు, వెంకటరమణ, ఈశ్వరరావు, రామసత్యం తదితరులు పాల్గొన్నారు.



జిఒ ఒకటి కాపీలను మంటల్లో వేసి దగ్ధం చేస్తున్న క్వారీ కార్మికులు, నాయకులు

పవన్కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని అమటాం రావివలస పంచాయతీలోని ప్రైవేట్ రిసార్ట్ వద్ద పవన్కు జనసేన నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ రిసార్ట్ నుంచి పవన్ కళ్యాణ్ శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో జరిగిన యువశక్తి సభకు 2.30 నిమిషాలకు బయలుదేరి వెళ్లారు. దీనికి ముందుగా యువత పెద్ద ఎత్తున రిసార్ట్ వద్దకు చేరుకున్నారు. వారికి అభివాదం చేస్తూ పవన్ ముందుకు సాగారు. కొంతమంది యువకులు పవన్ కళ్యాణ్కు ప్రత్యేక చిత్రపటాలతో పాటు పుస్తకాలు అందజేశారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్

డిఇఒను కలిసిన ఫ్యాప్టో నాయకులు

విద్యారంగంలో మొదటి స్థానంలో నిలబెట్టాలి : డిఇఒ



డిఇఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల నూతనంగా ఎన్నికైన ఫ్యాప్టో చైర్మన్ బి.మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, కార్యవర్గ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా డిఇఒ లింగేశ్వర రెడ్డిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. జిల్లాను విద్యారంగంలో ప్రథమస్థానంలో నిలపాలని ఈ సందర్భంగా డిఇఒ సూచించారు. ఫ్యాప్టో, ఇతర సంఘాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన డిఇఒ త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ఉపాధ్యాయుల బిల్లుల సమస్య పరిష్కరించాలి

ఉపాధ్యాయులకు సంబంధించి ఇంక్రిమెంట్ బిల్లులు రాజాం ఎస్టిఒ చేయకుండా రక రకాల నిబంధనలు పేరుతో తిరస్కరిస్తున్నారని, జిల్లా డిడి జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకులు వినతి అందజేశారు. సమస్య పరిష్కారం చేయకపోతే డిడి కార్యాలయం వద్ద ఈనెల 23న ప్రత్యక్ష కార్యచరణ చేపడతామని తెలిపారు. డిడి స్పందించి ఈనెల 20 లోపు సమస్య పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఆర్. మోహన్ రావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జె.రమేష్ చంద్రపట్నాయక్, జెఎవిఅర్కె ఈశ్వరరావు, డివిజనల్ కార్యదర్శి జి రమేష్, జిల్లా కార్యదర్శి డి.వెంకట్రావు, రాజాం మండల అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టి.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రయాణికుల సౌకర్యార్థమే కొత్త బస్సులు

జోనల్ చైర్పర్సన్ బంగారమ్మ

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రయాణికుల సౌకర్యార్థం నూతన బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎపిఎస్ ఆర్టిసి జోనల్ చైర్పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. గురువారం విజయనగరం డిపోలో రెండు ఆల్ట్రా పల్లెవెలుగు బస్సులను జెండా ఊపి ఆమె ప్రారంచారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆర్టిసి మరింత అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈబస్సులు విజయనగరం నుంచి పార్వతీపురం రూటులో ప్రయాణీకుల సౌకర్యార్థం తిరుగుతాయని జిల్లా ప్రజా రవాణా అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం జోనల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ అప్పలనారాయణ, డిపో మేనేజరు జె.శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు బి.ఆదినారాయణ , యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రంగవల్లుల పోటీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక శిల్పారామంలో జిల్లా యంత్రాంగం గురువారం ఏర్పాటు చేసిన రంగవల్లుల పోటీలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో మహిళలు, బాలికలు హాజరై పోటీలో పాల్గొని పోటాపోటీగా రంగవల్లులను తీర్చిదిద్దారు. ఉత్తమ రంగవల్లులను ఎంపిక చేసి, శుక్రవారం జరిగే సంక్రాంతి సంబరాల్లో బహుమతులు అందజేయనున్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలను ఆర్డిఒ ఎంవి సూర్యకళ, డిఆర్డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, ఎపిడి సావిత్రి, మెప్మా పీడీ సుధాకరరావు, జిల్లా పర్యాటకాధికారి పిఎన్వి లక్ష్మీనారాయణ, ఐఅండ్పిఆర్ ఎడి డి.రమేష్, ఇతర అధికారులు పర్యవేక్షించారు.



ముగ్గులు వేస్తున్న మహిళలు

సంస్కృతికి ప్రతీకలు రంగోలీ పోటీలు

సంస్కతి సంప్రదాయాలకు ప్రతీకలు రంగోలీ పోటీలని ప్రముఖ టీవీ, సినీనటి జ్యోతి రాయ్ (గుప్పెడంత మనసు ఫేమ్ జగతి) అన్నారు గురువారం వాజీ ఛానల్ ఆధ్వర్యాన ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించిన రంగోలి పోటీలు మంత్రముగ్ధులను చేశాయి. సజనాత్మకతకు అద్దం పట్టాయి. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా మాజరైన సినీనటి జ్యోతి రాయ్ మాట్లాడుతూ ఇక్కడ మహిళలు వేసిన ముగ్గులు రంగురంగులను రంగరించుకుని సరికొత్త కళను ఆవిష్కరించాయని అన్నారు. వాజీ ఛానల్ మేనేజింగ్ డెరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా భారతీయ సంప్రదాయాలు, సంస్కతి పరిరక్షణలో భాగంగా మహిళలను ప్రోత్సహించేందుకు రంగోలీ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

సాంకేతిక సామర్థ్యంలో సెంచూరియన్ దిట్ట

జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సాంకేతిక సామర్థ్యంలో సెంచూరియన్ విశ్వ విద్యాలయం మంచి పేరు, ప్రఖ్యాతులు సాధించిందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కొనియాడారు. వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జి ఎస్ఎన్ రాజు ఆహ్వానం మేరకు ఆయన గురువారం విశ్వ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంచూరియన్ యాజమాన్యం లాభాపేక్ష లేకుండా మారుమూల ప్రాంతంలో విశ్వవిద్యాలయం నెలకొల్పడం ద్వారా ఈ ప్రాంత విద్యార్థుల అవసరాలు తీరుతున్నాయన్నారు. ప్రభుత్వపరంగా తన వంతు సహకారాన్ని అందిస్తామన్నారు. ఎనిమిది రంగాలలో పేటెంట్లు కలిగి ఉండటం, విద్యార్థుల సాంకేతిక ఆవిష్కరణలు, నైపుణ్య శిక్షణ , స్టార్టప్స్ వంటి అంశాలు గురించి ఆయనకు వైస్ ఛాన్సెలర్ వివరించారు. అనంతరం స్కిల్ డెవలప్మెంట్ విభాగంలో ఇ-ఆటో, మెకానికల్, టైలరింగ్ యూనిట్లను సందర్శించారు. కెజిబివి విద్యార్థులకు యూనిఫారాలు సరఫరా చేసేందుకు విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకునేందుకు ప్రాజెక్టు రిపోర్టును ఇవ్వాలని సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడును ఆదేశించారు. విశ్వవిద్యాలయంలో తయారు చేస్తోన్న ఇ-ఆటోలను ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ సన్నీ డియోల్, డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డాక్టర్ పల్లవి, చీపురుపల్లి వైసిపి అధ్యక్షులు వల్లిరెడ్డి శ్రీనివాసరావు, రవీంద్ర, డివిఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇ-ఆటోను ప్రారంభిస్తున్న జెడ్పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశకి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి నూతలపాటి పరమేశ్వరరావు ప్రథమ వర్ధంతి సభ జిల్లా అధ్యక్షులు షేక్ బుకారి బాబు అధ్యక్షతన స్థానిక లక్క పందిరి వీధిలో గురువారం జరిగింది. పరమేశ్వర రావు విద్యార్థి దశ నుంచి ప్రగతిశీల రాజకీయాల్లో చురుగ్గా పాల్గొని, ఆరు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించారని తెలిపారు. ప్రధాన కార్యదర్శి పాలతేరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎపిటిఎఫ్కు ప్రధాన కార్యదర్శిగాను, ఉపాధ్యాయ పత్రికకు ప్రధాన సంపాదకులుగా ఉంటూ ఎపిటిఎఫ్ ను శిఖరాగ్రస్థాయిలో నిలబెట్టడానికి పరమేశ్వర రావు కృషి ఎనలేదన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ, ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక ,కర్షక వ్యతిరేక నిర్ణయాలు తిప్పి కొట్టాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్చార్జి మద్రాపు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మజ్జి ఉపేంద్ర పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 17, 21 విభాగంలో షూటింగ్ బాల్ జిల్లా జట్లు ఎంపిక పూర్తయ్యింది. గురువారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ ఎంపిక కు జిల్లా వ్యాప్తంగా పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం 12మంది తో అండర్ 17, 12 మందితో అండర్ 21 జట్లను ఎంపిక చేసినట్లు చీఫ్ కోచ్ అప్పలనాయుడు తెలిపారు. వీరంతా త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కొత్త కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బుచ్చన్న కోనేరు ప్రాంతంలో ఎన్నో ఏళ్లగా నిరీక్షించిన ప్రజల ఆకాంక్ష నెరవేరింది. ఎగువ గట్టు ప్రాంత మహిళల తాగునీటి కష్టాలు తొలగిపోయినట్లు అయ్యింది. గురువారం బుచ్చన్న కోనేరు ఎగువ గట్టు ప్రాంత వాసులకు ఏర్పాటు చేసిన కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కంటుబుక్త తవిట్రాజు మాట్లాడుతూ గత పాలకులు నిర్లక్ష్యం వల్ల ఎగువ ప్రాంతం వారికి నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉండేవన్నారు. గడ్డు పరిస్థితిని డిప్యూటీ స్పీకర్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన 200 ఇళ్ల వరకు కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారన్నారు. రూ.80 లక్షలతో చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్ నాగవల్లి, కాళ్ళ సూరిబాబు, కనకల కృష్ణ, గిరి పాల్గొన్నారు.



కుళాయిలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

మాన్సాస్ విద్యాసంస్థలను ప్రభుత్వమే నడిపించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూతపడుతున్న మాన్సాస్ విద్యా సంస్థలను ప్రభుత్వమే నడిపించాలని బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గదులు వెంకటరావు కోరారు. గురువారం ఈమేరకు డిఆర్ఒ గణపతిరావుకు వినతి అందజేశారు. ప్రస్తుతం మాన్సాస్ సంస్థానం ఆధ్వర్యాన నడుపుతున్న పాఠశాలలు, కళాశాలలను నష్టాల పేరుతో మూసివేయడం తగదన్నారు. ఇటీవల కాలంలో మహిళా కాలేజీల ఐటిఐ సంస్థను మూసివేశారని తెలిపారు. ఏకైక లా కాలేజీలో ఆన్లైన్ అడ్మిషన్లు జరగకుండా ఆపివేశారని తెలిపారు. విద్యాసంస్థలను తెరిపించి నడిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ఉపాధ్యక్షులు రామేశ్వరం రామారావు, కార్యదర్శి ఎస్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లి పథకాలపై ఆరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 4వ డివిజన్ మంగళవీధిలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ ఏ ఇంటికి వెళ్లినా ప్రభుత్వ పథకం ఏదో రూపంలో అందుతుందని చెప్పడం ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, , స్థానిక కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7 గంటలకు నగరానికి చేరుకొని స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు.

క్రికెట్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం

స్ఫూర్తి ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 15 నుంచి 19 వరకు విజయనగరం చింతలవలస క్రికెట్ స్టేడియంలో జరగబోయే జిల్లా స్థాయి క్రికెట్ పోటీల పోస్టర్ను జెడ్పి చైర్మన్ ఎం.శ్రీనివాసరావు ఆవిష్కరించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఆరు వార్డులకు ఉజ్వల యోజన ఉచిత ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను పంపిణీ జరిగింది. గురువారం జరజాపు పేటలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులు మీదుగా ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతి ఛైర్మన్ బంగారు సరోజినీ, కో-ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఛైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణా, కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, తహశీల్దార్ కె.వి రమణ రాజు, నాగ వంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, నాయకులు పోలుబోతు నారాయణ, నల్లి శ్రీను, తుమ్ము భారతి కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

బొబ్బిలిరూరల్ : మండలంలోని నారాయణప్పవలస సచివాలయంలో గురువారం ఆర్‌డిఒ శేషశైలజ రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు వివాదాలు లేని, పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే సర్వేలు నిర్వహించి పత్రాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.రాజారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం

డెంకాడ: ఎన్‌జిఒ తాలూకా యూనిట్ ఉద్యోగులు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును గురువారం ఘనంగా సత్కరించారు. కొత్తగా ఎన్నికయిన ఎన్‌జిఒ తాలూకా యూనిట్ కార్యవర్గం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భోగాపురంలో ఎన్‌జిఒ భవనానికి స్థలం, నిధులు మంజూరు చేయించాలని ఎన్‌జిఒ అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు కోరగా భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సంతోష్, అసోషియేసన్ అధ్యక్షులు జగదీష్, ఉపాధ్యక్షులు గణపతి, సత్యనారాయణ, జి.సత్యనారాయణ, మహిళా కార్యదర్శి కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులు సుధాకర్, లక్ష్మణరావు, రమణమూర్తి, ఉదయ్ కుమార్ మూడు మండలాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

సబ్సిడీపై కారు లోను

డెంకాడ : డెంకాడ గ్రామానికి చెందిన డోల రామారావుకు ఎస్‌బిఐ సౌజన్యంతో కారులోనును సబ్సిడీపై ఎంపిపి వెంకట వాసుదేవరావు చేతులు మీదుగా వైకెపి కార్యాలయంలో అందించారు. గంజి పద్మావతికి పిఎంఇజిపి కింద ఎపిజివిబి ద్వారా జిరాక్స్ మిషను సబ్సిడీపై అందించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ రొంగళి కనక సింహచలం, సర్పంచ్ గౌరి, వైస్ సర్పంచ్ ఆదినారాయణ, వార్డు మెంబెర్ సురేష్ ఎపిఎం విజయలక్ష్మి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు నాణ్యతను పరిశీలించిన డిటి

విజయనగరం : రేషన్ దుకాణాల ద్వారా ఇస్తున్న కంది పప్పు నాణ్యతను విజయనగరం డిటి వర్రి వెంకటరామజగన్నాథరావు ఆధ్వర్యంలో గురువారం దాసన్నపేటలోని 52 రేషన్ డిపో వద్ద సిబ్బంది పరిశీలించారు. కంది పప్పులో నాణ్యత లోపించినట్లు విమర్శలు వచ్చన నేపథ్యంలో ఈ తనికీలు చేపట్టారు. డిపో వద్దే పొయ్యిపై పప్పును ఉడికించి నాణ్యతను పరిశీలించారు. పరిశీలనలో సివిల్ సప్లయ్ టెక్నికల్ అసిస్టెంట్ హరికిరణ్, 8,9 సచివాలయాల విఆర్‌ఒలు సత్యవతి, నారాయణప్పడు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

పూసపాటిరేగ : సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో పారిశుధ్యం, పరిశుభ్రతపై పంచాయతీలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాయి. గురువారం మండలంలోని గుంపాంలో సర్పంచ్ యడ్ల ఆదిలక్ష్మితో పాటు కార్యదర్శి తిర్లంగ గాయత్రి పారిశుధ్య పనులు చేయించారు. గ్రీన్ అంబాసిడర్‌లతో గ్రామంలో ఉన్న చెత్త చెదారం శుభ్రం చేయించారు. కార్యదర్శి గాయత్రి మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎటువంటి అంటువ్యాధులు ప్రభల కుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. సచివాల సిబ్బంది సహకారంతో పంచాయతీ పరిధిలో ఉన్న తొత్తడాం, కొవ్వాడ గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేయించామన్నారు.

22న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి : ఈ నెల 22న యంగ్ మేన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో సర్వకళల ఆనందోబ్రహ్మ ప్రదర్శనను కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహనరావు తెలిపారు. గురువారం బృందావనం ఫంక్షన్ హాల్లో నూతన కళాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ప్రతినెలా ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో నూతన ఔత్సాహిక కళాకారులకు మంచి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. చారిత్రక, పౌరాణిక, జానపద, శాస్త్రీయ, జానపద విభాగంలో పలువురు కళాకారుల ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో హ్యాపీ క్లబ్ సభ్యులు ఎన్నా బాబు తాడుతూరి, ఆర్.బెనర్జీనాయుడు, బి.జి.గంగాధర్, పి.నాగరాజు, పి.వెంకటరావు పాల్గొన్నారు.

చెత్తబుట్టలు పంపిణీ

మెంటాడ : మండలంలో గుర్ల గ్రామంలో ఆప్రో సంస్థ, ఎల్ఐసిహెచ్‌ఎఫ్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు గ్రామస్తులకు డస్ట్ బిన్లు పంపిణీ చేశారు. పొడి, తడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు ఈ చెత్తబుట్టలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.సత్యవతి, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, ఆప్రో ప్రతినిధి చుక్క శ్రీరాములు నాయుడు పాల్గొన్నారు.

బాబోయ్.. కుక్కలు

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ గురుకులం, కెజిబివి, ఎపి ఆదర్శ పాఠశాల పరిసరాల్లో కుక్కలు హడలెత్తిస్తున్నాయి. కుక్కలు గుంపులుగా రావడం, గోడలు దూకి లోపలికి ప్రవేశించడంతో విద్యార్థులు, సిబ్బంది హడలిపోతున్నారు. కుక్కల బారిన పడి ప్రమాదాలు కాకముందే సంబంధిత అధికారులు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



కుక్కల గుంపు



సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపిపి సత్యవంతుడు

సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన

వేపాడ : మండలంలోని కెఆర్‌పేట గ్రామంలో గురువారం సిసి రోడ్డు పనులకు ఎంపిపి డి.సత్యవంతుడు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, సర్పంచ్ చెలిబోని బాలబాబు, మాజీ సర్పంచ్ పైడిబాబు, వైసిపి నాయకులు బోజంకి శ్రీను, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక నగర పంచాయతీ ఆదిత్య విద్యాలయంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు, సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.సూరిబాబు, హెచ్ఎం వి. అమృత భోగి మంటలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామి వివేకానంద చిత్రపటానిక పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం విద్యార్థులు పేరెంట్స్ సాంప్రదాయ ముగ్గులు వేసి గొబ్బెమ్మలు అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మెంటాడ : గాయత్రి విద్యానికేతన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

వంగర: వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులు ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు వేసిన హరిదాసు వేషదారణ భోగి మంట వేడుక సంక్రాంతి పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పద్మావతి, వివేక్ మాస్టర్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని నందిగామ పంచాయతీలో సర్పంచ్ గరే మురళీమోహన్‌రావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుమారు 60 మంది పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు ఎంపిపి ఉప్పాడ అనూష చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, మాజీ ఎంపిటిసి గరే సంజీవ్ పాల్గొన్నారు.

డెంకాడ: జొన్నాడ వద్ద గల లెండి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలను కళాశాల విద్యార్థులు సిబ్బంది ఘనంగా నిర్వహించారు. భోగి మంటల్లో పిడకలు వేస్తూ నృత్యాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పి. మధుసూదన రావు, వైస్ ఛైర్మన్ పి శ్రీనివాస రావు, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె. శివరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి, వైస్ ప్రిన్సి పాల్స్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, డాక్టర్ పరాంకుశం అన్ని విభాగాల అధిపతులు డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే సంప్రదాయాలకు వారసులు

బొబ్బిలిరూరల్ : రానున్న భావితరాలకు సంప్రదాయాలను పరిచయం చేసేది విద్యార్థులేనని నారాయణప్పవలస పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సి.రాజు అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలో విద్యార్థులతో మినీ సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని అరటి బోదెలు, చెరుకు గడలు, మామిడి తోరణాలతో, రంగవల్లులతో విద్యార్థులు అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంప్రదాయ దుస్తులు, ఫ్యాన్సీ డ్రెస్ షో, గాలి పటాల ప్రదర్శన, నృత్య పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఏడో తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న హరిదాసు వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, రామచంద్రరావు, మురళి, భానుప్రకాశ్, మహేష్, వార్డ్ మెంబర్ పూడి గోపాల్ పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్.. హరిదాసు వేషధారణలో ఉన్న విద్యార్థిని లక్ష్మి ప్రసన్న

యువతకు ఆదర్శం.. స్వామి వివేకానంద

ప్రజాశక్తి-బొబ్బిలి

స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని డిఎస్‌పి బి.మోహనరావు కోరారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గురువారం పోలీస్‌స్టేషన్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ తోటివారికి సేవ చేయడం ద్వారా ప్రతి మనిషి తనలోని దైవత్వాన్ని చూడవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యనారాయణ, జ్ఞానప్రసాద్, దాలినాయుడు పోలీస్ సిబ్బంది రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్, కార్యదర్శి శ్రీహరి, ప్రతినిధులు చంద్రకిశోర్, జి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసన్, కె.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి : వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న డిఎస్‌పి మోహనరావు

బహుమతులు పంపిణీ

పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ సంక్రాంతి రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులను పంపిణీ చేశారు. డిఎస్‌పి మోహనరావు, సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐలు సత్యనారాయణ, జ్ఞానప్రసాద్, దాలి నాయుడును సత్కరించారు.

బాడంగి : ఎరుకులపాకలు గ్రామంలో ఎంపిటిసి పాలవలస గౌరు, సర్పంచ్ పాలవలస పార్వతి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. వివేకానంద బోధనలను చిన్నతనం నుంచే ప్రతిఒక్కరూ ఆచరిస్తే వ్యక్తిగత అభివృదితో పాటు సమాజ సేవ, క్రమ శిక్షణ అలవాటవుతుందని గౌరు తెలిపారు.

కొత్తవలస : వివేకానంద సేవా సమితి, సమరసత సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తవలస జంక్షన్‌లోని వివేకానంద విగ్రహం వద్ద జయంతిని నిర్వహించారు. పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానంద సమితి అధ్యక్షులు కొరుపోలు అప్పారావు, మాన్యం దేముడు, కనకాల శివ, కొరుపోలు సూరిబాబు, నరసింగరావు, కె.సూర్య నూకరాజు, సతీష్, మహాదాసు వెంకటరమణ, పైల దేముడు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : మండలంలోని రెల్లివలసలోని వివేకా విద్యా విహార్ యుపి పాఠశాలలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులంతా ప్లకార్డులు పట్టుకొని యువత మేలుకో, గమ్యం చేరే వరకూ విశ్రమించకంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ తాళపూడి శ్రీరామూర్తి, పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

వంగర: వివేకానంద మార్గం యువతకు స్ఫూర్తి దాయకమని స్థానిక వివేక్ మాస్టర్ మైండ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఈశ్వరరావు, పారినాయుడు అన్నారు. స్వామి వివేకానంద జన్మ దినోత్సవ వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, లక్ష్మన్నాయుడు, దాలినాయుడు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

విజయనగరం టౌన్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూరల్ సిఐ తిరుపతిరావు గారు సౌజన్యంతో గురువారం రెండు కిలోమీటర్ల వాకింగ్, రన్నింగ్ కార్యక్రమాన్ని విజ్జి స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, డాక్టర్ జెసి నాయుడు, డాక్టర్ ధర్మా నాయుడు , డాక్టర్ అచ్యుత రామయ్య , డాక్టర్ శివరాం, రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్ కుమార్, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ వివేకానంద స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ నింపుకోవాలని, ఆయన మార్గంలో నడవాలని అన్నారు. పరుగులో ప్రతిభ కనబరిచిన ఉమెన్ కానిస్టేబుల్ లక్ష్మీ, రజినీలకు డాక్టర్ తిరుమల ప్రసాద్ చేతుల మీదుగా రూరల్ సిఐ తిరుపతిరావు బహుమతులు అందజేశారు.

వివేకానంద ఆశయాలు అనుసరణీయం

బొబ్బిలిరూరల్ : స్వామి వివేకానంద ఆశయాలు ప్రతిఒక్కరూ ఆచరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు అన్నారు. అలజంగిలో వివేకానంద జయంతి సభను భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు కలిగిన మన దేశంలో బిజెపి మతోన్మాదులు అధికారంలోకి వచ్చాక మత ఘర్షణలను రెచ్చగొడుతున్నారని తెలిపారు. స్వామి వివేకానంద ఆశయాలను ఆయన రాసిన రచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో స్వామి వివేకానంద భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఆచారి బి. శంకర్రావు కార్మికులు పాల్గొన్నారు.

వైసిపిలో అభద్రతా భావం

టిడిపి మండల అధ్యక్షులు వెంకటరావు

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతో పవన్ కల్యాణ్ కలవడంతో అధికార పార్టీలో ఒక్కసారిగా అభద్రతా భావం మొదలైందని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మండలంలో వైసిపి గ్రూపు రాజకీయాల వల్ల ఎవరి మాట వినాలో పాలుపోక సతమతమవుతున్నారని తెలిపారు. పవన్, చంద్రబాబు కలయికతో వైసిపి నాయకుల్లో గుబులు రేగుతోందని చెప్పారు. మరోవైపు మండలంలో కొంతమంది టిడిపి నాయకులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే బాధేస్తోందన్నారు. పార్టీ మండల అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తరువాత శాయశక్తుల కష్టపడి గ్రామస్థాయిలో పార్టీ పునర్నిర్మాణానికి పనిచేశానని చెప్పారు. గ్రూపు రాజకీయాలకు కూడా తావు లేకుండా బాదుడే బాధడు, ఇదేం కర్మ కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఇలాంటి తరుణంలో ఎన్‌ఆర్‌ఐ గొంప కృష్ణకు అమ్ముడుపోయానంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని వారు, టిడిపిని విడిచిపెట్టి వైసిపిలో చేరి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టిడిపి అధిష్టానం ఎవరికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తే, వారి విజయం కోసం అహర్నిహలు శ్రమిస్తానని, అదే తనముందున్న లక్ష్యమని స్పష్టంచేశారు.

సెలవులు పెడితే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో పారిశుధ్య ఉద్యోగులు, కార్మికులు సెలవులు పెడితే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. మున్సిపల్ మస్టర్ కార్యాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ నేపథ్యంలో పారిశుధ్య సిబ్బంది సెలవులు పెట్టకుండా విధులు నిర్వహించాలని కోరారు. రోడ్లు, కాలువలు, కల్వర్టులు ప్రతిరోజూ శుభ్రం చేయాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి పండుగకు ఎక్కువ మంది వస్తారని, వారు అసౌకర్యానికి గురికాకుండా పనులు చేయాలని సూచించారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-బొబ్బిలి

విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఎం.బంగారురాజు, జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, టి.గంగాధర్ ఆధ్వర్యాన గురువారం ఆర్‌డిఒ శేషశైలజకు వినతి అందించారు. విశ్వబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని కించపరిచే సరాబు, కంసలోడా లాంటి పదాలు నిషేధించాలని కోరారు. స్వర్ణకారులకు మంగళసూత్ర తయారీపై పేటెంట్ హక్కులు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలన్నారు. కార్పెంటర్ యూనియన్‌కు 500 మందితో క్లస్టర్ ఏర్పాటు చేయాలని, కార్పెంటర్లకు 5 హెచ్‌పి మోటార్ కరెంటు వినియోగానికి రాయితీ ఇవ్వాలని కోరారు. 45 ఏళ్లు నిండిన విశ్వబ్రాహ్మణులకు పింఛను సదుపాయం కల్పిస్తూ ప్రతినెలా రూ.3వేలు జీవనభృతిగా ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త సర్వసిద్ధి త్రినాథ, యువజన నాయకులు పారది జగదీష్, సంతోష్ పాల్గొన్నారు

రీసర్వేకు సహకరించాలి : జెసి



ఉత్తరాపల్లి రైతులతో మాట్లాడుతున్న జెసి అశోక్

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామాల్లో చేపడుతున్న రీసర్వేకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ కోరారు. మండలంలోని ఉత్తరాపల్లి, దత్తి గ్రామాల్లో చేపడుతున్న రీసర్వేను గురువారం జెసి పరిశీలించారు. అక్కడకు విచ్చేసిన రైతులతో మాట్లాడారు. రైతులు రీసర్వేకు సహరించినప్పుడే వేగంగా సర్వే ప్రక్రియ పూర్తవుతుందన్నారు. రైతులు హాజరై సరిహద్దులను, కొలతలను సరిచూసుకోవాలని కోరారు. సర్వే కచ్చితంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఓటర్ల జాబితాకు ఆధార్ అనుసంధానం వేగంగా చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో పలు పథకాల అమలు, హౌసింగ్, పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాల పై సమీక్షించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అధోగతిపాలు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-బాడంగి

వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. ప్రజా వ్యతిరేకత పాలన సాగిస్తున్న వైసిపి ప్రభుత్వానికి చరమ గీతం పాడాలని కోరారు. మండలంలోని వాడాడ పంచాయతీలో గురువారం నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయనన్ని అప్పులు ప్రస్తుతం సిఎం జగన్ చేశారన్నారు. కేంద్రానికి కొమ్ముకాస్తూ అప్పులు తెచ్చేందుకు ఢిల్లీకి తిరగడానికి ఓ మంత్రిని ఏర్పాటు చేసుకున్నారని విమర్శించారు. నిబంధనల నెపంతో పింఛన్లు, రేషన్‌కార్డులు తొలగిస్తున్నారే తప్ప కొత్తగా ఇవ్వడం లేదన్నారు. ఎర్రవంకపల్లి పంచాయతీలో తాగునీటి బోర్లు, ట్యాంకులు, సిసి రోడ్లు టిడిపి పాలనలో ఏర్పాటు చేసినవేనని చెప్పారు. ఏ గ్రామానికెళ్లినా ప్రభుత్వంపై వ్యతిరేకత వినిపిస్తోందని, ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు తెంటు రవిబాబు, పాలవలస గౌరు, అచ్యుతరావు, త్రినాథ్ పాల్గొన్నారు.

బొబ్బిలి : వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు నష్టం వాటిల్లుతోందని టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్ అన్నారు. పట్టణంలోని 7, 8 వార్డుల్లో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు, విద్యుత్, బస్సు ఛార్జీలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏడో వార్డు ఇన్‌ఛార్జి రాంబార్కి స్వప్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బేబినాయనకు హారతిచ్చి తిలకం దిద్దుతున్న మహిళ

యువగళం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

స్వామి వివేకానాంద జయంతి, జాతీయ యువజనోత్సవం సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇన్‌చార్జ్ పతివాడ నారాయణ స్వామినాయుడు యువగళం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గురువారం స్వగ్రామం చల్లవానితోటలో టిడిపి అధ్వర్యంలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పేరుతో జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రను విజయవంతమవ్వాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ , నాయకులు పతివాడ తమ్మునాయుడు, పల్లె బాస్కరావు, కర్రోతు సత్యనారాయణ, గేదెల రాజారావు, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పతివాడ తారక్, నెల్లిమర్ల నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు పిన్నింటి కిషోర్, కర్రోతు రాజు, చందక ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిది నియంత పాలన

వంగర : వైసిపిది నియంత పాలనని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ అన్నారు. అరసాడ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని వైసిపి ప్రభుత్వం వైఫల్యాలపై ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో గ్రామాభివృద్ధికి కేంద్రం కేటాయించిన నిధులను దారి మళ్లించడంతో గ్రామాలాభివృద్ధి నోచుకోక కుంటిపడ్డాయన్నారు. తన అనాలోచిత నిర్ణయాలతో సిఎం జగన్ మోహన్ రెడ్డి నియంత పాలనను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, లచ్చుబుక్త ధనలక్ష్మి, లచ్చుబుక్త కృష్ణమూర్తి, బెజ్జిపురం రవి, బెజ్జిపురం ముకందరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా జి. శిగడాం మండలం ఆబోతుల పేటకు చెందిన ఎం.శ్రీనివాసరావు డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందారు. గుంటూరు నుంచి విశాఖపట్నం మీదగా శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు గుంటూరులో ఎసి మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మృతదేహాన్ని సుందర పేట సిహెచ్‌కి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని అరసాడ, కొండవలస జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రేగిడి మండలం కోడిశ గ్రామానికి చెందిన పెదగాడి హరిబాబు (37) అరసాడలో తన పని ముగించుకొని తిరుగు ప్రయాణంలో బైక్ పై కర్రలు పట్టుకొని వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొనడంతో హరిబాబుకు గాయాలయ్యాయి. ఢీకొన్న బైక్ ఆచూకీ కోసం గాలించిన ఫలితం లేకపోయింది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని రాజాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.